అరకొరగా వరి విత్తనాల సరఫరా

ఎన్డీయే కూటమి సర్కారు పాలనలో రైతు సేవా కేంద్రాల్లో రైతులకు విత్తనాలు అరకొరగానే అందుతున్నాయి. అసలు రైతుకు విత్తనాల లభ్యత గురించి సమాచారం ఇచ్చే నాథుడే లేడు. పైగా ప్రభుత్వం కేవలం అయిదు రూపాయలు మాత్రమే సబ్సిడీ ఇస్తోంది. దీంతో ఎక్కువ మంది రైతులు బయట మార్కెట్‌లోనే కొనుగోలు చేస్తున్నారు. అయితే బయట కొన్న విత్తనాలు ఎంతవరకు సరిగా పనిచేస్తాయో లేదోనని ఆందోళన చెందుతున్నారు.

- విత్తు కోసం బయట మార్కెట్ బాట పడుతున్న అన్నదాత
- ప్రభుత్వం ఇస్తున్న సబ్సిడీ రూ.5 మాత్రమే
- అవీ సాగుకు తగ్గ విత్తనాలు లేవు
- ఆన్‌లైన్‌లో బుక్ చేసుకున్న వారికే విత్తనాలంటున్న అధికారులు



పెడన బైపాస్ రోడ్డులో వరిపొలాన్ని సాగుకు సిద్ధం చేసుకుంటున్న రైతు

పెడన: కూటమి సర్కారు పాలనలో రైతు సేవా కేంద్రాల్లో విత్తనాలు తక్కువగా రావడంతో రైతులు బయట మార్కెట్‌లను ఆశ్రయిస్తున్నారు. ఆయా మండలాల్లో సాగుకు తగ్గ విధంగా విత్తనాలు సరఫరా చేయకపోవడం, విత్తనాలు అందుబాటులో ఉన్నాయనే విషయాన్ని రైతులను చైతన్యపరిచి విత్తనాల బుకింగ్ చేసుకునేలా ప్రోత్సహించకపోవడం వంటి కారణాలతో రైతులు బయట మార్కెట్‌ను ఆశ్రయించి విత్తనాలు కొనుగోలు చేస్తున్నారు. అవి పనిచేస్తాయో లేదో ఆ దేవుడికే ఎరుక...వేసిన తరువాత గాని పరిస్థితి తెలియదని రైతులు ఆందోళన చెందుతున్నారు. రైతు సేవా కేంద్రాల్లో క్షేత్రస్థాయిలోని సిబ్బంది తెలిసిన వారు, బుక్ చేసుకున్న వారికి మాత్రమే పైనుంచి విత్తనాలను రప్పించి అందజేస్తున్నారు. కొందరు రైతులు రైతు సేవా కేంద్రానికి వెళితే విత్తనాలు అయిపోయాయనే సమాధానం రావడంతో తప్పనిసరై బయట కొనుగోలు చేయాల్సి వస్తోంది. కొన్ని కేంద్రాల పరిధిలో అసలు విత్తనాలు వచ్చాయో రావో కూడా తెలియదని రైతులు చెబుతుండటం గమనార్హం.

మండలం	వరి సాగు విస్తీర్ణం (ఎకరాల్లో)	విత్తనాల సరఫరా (క్వింటాళ్లలో)
పెడన	23 వేలు	568
గూడూరు	22 వేలు	199
బంటుమిల్లి	13వేలు	265
కృత్తివెన్ను	5,200	85

విత్తనాలు వచ్చినట్టే తెలియదు



సొంత పొలంతో పాటు కౌలుకు, అన్నదమ్ములకు చెందిన మొత్తం 15 ఎకరాలు సాగు చేస్తున్నా. రైతు సేవా కేంద్రాల్లో విత్తనాలు వచ్చినట్టు ఎవరూ చెప్పలేదు. రైతులకు దిశా నిర్దేశం చేసే అధికారులు, క్షేత్రస్థాయి సిబ్బంది ఎవరూ ఉండటం లేదు. నేను కాకర్లమూడిలోని మోతుబరి రైతు నుంచి విత్తనాలు కొనుగోలు చేశా.

– అబ్బూరి అప్పన్న, గుణ్ణాలపల్లి, పెడన

పెడన వచ్చి కొనుగోలు చేశా



మా ప్రాంతంలోని రైతుసేవా కేంద్రానికి వెళ్లా. అక్కడ విత్తనాలు అయిపోయాయన్నారు. రైతువారీగా కొనుగోలు చేద్దామనుకున్నా ఎవరూ అందుబాటులో లేరు. దీంతో పెడన వెళ్లి అక్కడ దుకాణంలో 1318 రకం వరి విత్తనాలను కొనుగోలు చేసి తీసుకువెళుతున్నా. ప్రభుత్వం కేజీకి రూ.5 మాత్రమే సబ్సిడీ ఇస్తోంది. బయట మార్కెట్ ధరకు, ఆర్‌ఎస్‌కేలో ఇచ్చే ధరకు పెద్దగా వ్యత్యాసం లేదు.

– పాశం రాము, నీలిపూడి, కృత్తివెన్ను మండలం

రైతులు బుక్ చేసుకుంటే విత్తనాలను రప్పిస్తాం



విత్తనాల సరఫరా ఇంకా కొనసాగుతోంది. రైతులు బుక్ చేసుకోక ముందే ఇండెంట్ ప్రకారం విత్తనాలు రావడం, అవి అయిపోవడంతో మళ్లీ ఇండెంట్ పెట్టాం. ఇప్పటి వరకు రెండు దఫాలుగా విత్తనాలు వచ్చాయి. రైతులు ఆర్‌ఎస్‌కేలోని ఆన్‌లైన్‌లో బుక్ చేసుకుంటే త్వరగా వస్తాయి.

– నూరున్నీసా, ఇన్‌చార్జి ఏవో, పెడన మండలం

క్లుప్తంగా

బండ్రేవుకోడులో గుర్రపుడెక్క నివారణ చర్యలు



చల్లపల్లి: స్థానిక బండ్రేవుకోడు మురుగునీటి కాలువలోని గుర్రపుడెక్క నివారణకు మంగళవారం చర్యలు చేపట్టారు. పాగోలు నుంచి ప్రారంభించి మంగళాపురం వరకూ 8.2 కి.మీ. పొడవునా గుర్రపుడెక్క నివారణకు మందులు పిచికారీ చేస్తున్నట్లు చల్లపల్లి నీటిసంఘం అధ్యక్షుడు నిడమానూరి దిలీప్ కుమార్ తెలిపారు. మురుగు కాలువ పొడవునా గుర్రపుడెక్క ఉధృతంగా ఉండటంతో వాటి నివారణకు మందులు పిచికారీ చేసేందుకు కనీసం మూడు రోజులు సమయం పడుతుందని చెప్పారు.

వైఎస్సార్ సీపీ రాష్ట్ర అనుబంధ విభాగ కమిటీ నియామకం

మచిలీపట్నం: వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు కృష్ణా జిల్లాకు చెందిన పలువురిని రాష్ట్ర పార్టీ అనుబంధ విభాగ కమిటీలలో వివిధ హోదాలలో నియమించారు. పార్టీ రాష్ట్ర ఎస్టీ విభాగం ప్రధాన కార్యదర్శిగా యాకసిరి వెంకటేశ్వరరావు(మచిలీపట్నం), రాష్ట్ర కల్చరల్ విభాగం సంయుక్త కార్యదర్శిగా తుమ్మలపల్లి సుబ్రహ్మణ్యేశ్వర బాబు (గుడివాడ) నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం ఒక ప్రకటన విడుదల చేసింది.

మధ్యాహ్న భోజనం మెరుగుపరచాలి



పెడన: పాఠశాలలో విద్యార్థుల సంఖ్య మరింత పెరగాలని, మధ్యాహ్న భోజనాన్ని మెరుగుపరచాలని ఎంపీడీవో ఎ.అరుణకుమారి పాఠశాల హెచ్‌ఎంకు సూచించారు. ఎంఈవో–2 హరనాథ్‌తో కలిసి మంగళవారం ఆమె పట్టణంలోని ఐదో వార్డులో ఉన్న ఉర్దూ మిక్స్‌డ్ స్కూలును సందర్శించారు. ఇరువురు అక్కడే మధ్యాహ్న భోజనం చేశారు. హెచ్‌ఎం సూర్య సుల్తానా, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మలేరియా అంతం మన చేతుల్లోనే

పెడన: మలేరియా అంతం మన చేతుల్లోనే ఉంటుందని, మలేరియా ప్రబలకుండా పటిష్ట చర్యలు తీసుకోవడమే ప్రధాన లక్ష్యమని మచిలీపట్నం మలేరియా సబ్‌యూనిట్ అధికారి పి మురళి అన్నారు. మలేరియా మాసోత్సవాలను పురస్కరించుకుని ఈ నెల ఒకటి నుంచి జూన్ 30 వరకు వివిధ కార్యక్రమాలలో భాగంగా మంగళవారం బీజీకే జెడ్పీహెచ్‌ఎస్ నుంచి ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో యూపీహెచ్‌సీ వైద్యురాలు టి.హిమపద్మజ, ఆశ వర్కర్లు, ఏఎన్‌ఎంలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

యోగాతో ఏకాగ్రత

మచిలీపట్నంఅర్బన్: యోగ సాధనతో బాలికల ఆరోగ్యంతో పాటు ఏకాగ్రత పెరుగుతుందని కృష్ణా యూనివర్సిటీ ఎన్‌ఎస్‌ఎస్ కోఆర్డినేటర్ ఎం.శ్రావణి అన్నారు. అంతర్జాతీయ యోగ దినోత్సవం పురస్కరించుకుని స్థానిక లేడీ యాంప్తిల్ ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో మంగళవారం యోగాపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. యోగ సాధన వలన విద్యార్థుల జ్ఞాపకశక్తి వృద్ధి చెందడం కాకుండా రుతుక్రమ సమస్యలు ఉత్పన్నం కావన్నారు. యూనివర్సిటీ ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ పి.గోపి విద్యార్థులకు యోగాసనాలు నేర్పించారు.

పాఠశాల అభివృద్ధికి అనూరాధ కృషి అభినందనీయం



అనూరాధ దంపతులను సన్మానిస్తున్న పాఠశాల ఉపాధ్యాయ బృందం

పెదప్రోలు(మోపిదేవి): పాఠశాల అభివృద్ధిలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు అనూరాధ పాత్ర అభినందనీయమని ఎంపీపీ రావి దుర్గావాణి అన్నారు. మండల పరిధి లోని పెదప్రోలు జెడ్పీ పాఠశాల హెచ్‌ఎం కలపాటి అనూరాధ మే 31న ఉద్యోగ విరమణ చేశారు. ఈ సందర్భంగా మంగళవారం పాఠశాల ఆవరణలో ఆమెను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ ఉత్తమ ఉపాధ్యాయురాలుగా అవార్డు అందుకున్న అనూరాధ పాఠశాల అభివృద్ధికి ఎంతో కృషిచేసారని, ఆటస్థలం ఏర్పాటుకు ఇతోధికంగా స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారుల దృష్టికి అనేక సార్లు తీసుకెళ్లి సాధించగలిగారని కొనియాడారు. అనంతరం అనూరాధ, రవి ప్రసాద్ దంపతులకు భారీ గజమాలవేసి, మెమెంటో అందించి ఘనంగా సన్మానించారు. పాఠశాల హెచ్‌ఎం రమణ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పాలిమెట్ల ఏసుబాబు, మాజీ సర్పంచ్‌లు మద్దిపట్ల జగన్మోహనరావు, రావి నాగేశ్వరరావు, ఎస్‌ఎంసీ కమిటీ చైర్మన్ వై అనిత తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్మీడియెట్ బాలికల సంఖ్య పెంపునకు కృషిచేయాలి

నాగాయలంకలో బీసీ బాలికల పోస్ట్ మెట్రిక్ హాస్టల్ ప్రారంభించిన ఎమ్మెల్యే



కళాశాల హాస్టల్ బాలికలతో ఎమ్మెల్యే బుద్ధప్రసాద్, జిల్లా అధికారి రమేష్ తదితరులు

నాగాయలంక: స్థానిక ప్రభుత్వ బీసీ సంక్షేమ బాలికల వసతి గృహానికి అనుబంధంగా కళాశాల బీసీ బాలికల హాస్టల్(పోస్ట్ మెట్రిక్ హాస్టల్)ను మంగళవారం అవనిగడ్డ శాసనసభ్యుడు మండలి బుద్ధప్రసాద్ లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెడన నియోజకవర్గంలో ఖాళీగా ఉన్న పోస్ట్ మెట్రిక్ హాస్టల్‌ను ఈ ప్రాంతవాసుల అవసరతను గుర్తించి వారి అభ్యర్థన మేరకు తక్షణం మంజూరు చేసిన కలెక్టర్ బాలాజీకి బాలికలు, తల్లిదండ్రుల తరఫున కృతజ్ఞతలు తెలిపారు. 15 మందితో ఆరంభమైన హాస్టల్‌లో బాలికల సంఖ్యను 50 మందికి పైగా పెంపొందించేందుకు హైస్కూలు ప్లస్ ఉపాధ్యాయులు, విద్యాశాఖ అధికారులు కృషి చేయాలని సూచించారు. జిల్లా బీసీ సంక్షేమశాఖ అధికారి గుమ్మా రమేష్, అవనిగడ్డ బీసీ సంక్షేమశాఖ సహాయ అధికారి దివ్య, గ్రామ సర్పంచ్ కైతేపల్లి అంకాలు, ఎంఈఓ రామదాసు, మాజీ సర్పంచి మండవ బాలవర్ధిరావు, హెచ్‌ఎం సత్యనారాయణ పాల్గొన్నారు.

కోర్టు భవనం ప్రారంభించిన జిల్లా న్యాయమూర్తి



బంటుమిల్లి: మరమ్మతులు పూర్తి చేసుకున్న బంటుమిల్లి జూనియర్ సివిల్ కోర్టు భవనాన్ని జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.గోపీ మంగళవారం ప్రారంభించారు. కార్యక్రమంలో బంటుమిల్లి జూనియర్ సివిల్ జడ్జి ఎం.భాస్కరరావు, బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు యాళ్ళ సోమశేఖర్, కె.నాగాంజనేయులు, ఎక్సైజ్ సీఐ వైజీవీ రమణ, ఎస్‌ఐ ఎ.గణేష్‌కుమార్, బార్ అసోసియేషన్ సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రశాంతంగా మెగా డీఎస్సీ పరీక్ష

పెడన: మండల పరిధిలోని నందమూరు శ్రీవాసవి ఇంజినీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రంలో మెగా డీఎస్సీ పరీక్ష మంగళవారం ప్రశాంతంగా జరిగినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి.రాజారమేష్, అడ్మిన్ పి.అశోక్‌కుమార్ తెలిపారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు జరిగిన ఈ పరీక్షకు 185 మందికి గాను 182 మంది హాజరయ్యారని తెలిపారు. మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరిగిన రెండో సెషన్‌లో 180 మందికి గాను 169 మంది హాజరయ్యారన్నారు.

మాజీ సీఎం జగన్‌ను కలసిన మాజీ ఎమ్మెల్యే సింహాద్రి



తాడేపల్లిలో మాజీ సీఎం జగన్‌ను కలుసుకున్న మాజీ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు, వికాస్

అవనిగడ్డ: మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మాజీ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు, ఆయన తనయుడు సింహాద్రి వికాస్ మంగళవారం మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. తాడేపల్లి కార్యాలయంలో జగన్‌మోహన్‌రెడ్డిని కలుసుకున్న ఎమ్మెల్యే సింహాద్రితో నియోజకవర్గ సమస్యల గురించి వైఎస్ జగన్ చర్చించారు. వెన్నుపోటు దినం నిరసన కార్యక్రమం బాగా చేశారని, ఇక ముందు కూడా ప్రజా సమస్యలపై మరింతగా పోరాడాలని సూచించారు. గతంలో తన హయాంలో మంజూరైన పలు పథకాలు, వాటి తీరు తెన్నుల గురించి అడిగి తెలుసుకున్నారు.

ఈ సీజన్‌లో ఎరువులు విక్రయించం

- నాగాయలంక ఫెర్టిలైజర్స్ అసోసియేషన్ ప్రకటన
- హోల్‌సేల్ వ్యాపారుల వైఖరిపై అధికారులకు ఫిర్యాదు



ఏడీఏ, ఏఓలకు వినతిపత్రం అందజేసిన నాగాయలంక ఫెర్టిలైజర్స్ అసోసియేషన్ నేతలు

నాగాయలంక: హోల్‌సేల్ వ్యాపారుల ధోరణితో తాము 2025 సీజన్‌లో ఎరువులు విక్రయించరాదని తమ సమావేశంలో నిర్ణయించినట్లు నాగాయలంక ఫెర్టిలైజర్స్ అసోసియేషన్(ఎన్‌ఎఫ్‌ఏ)నేతలు బుధవారం అవనిగడ్డ వ్యవసాయ సహాయ సంచాలకురాలు జయప్రద, స్థానిక ఏఓ ఎ.సంజీవరావుకు వినతిపత్రం సమర్పించారు. ఈ సీజన్ దృష్టిలో పెట్టుకుని జూన్‌లోనే హోల్‌సేల్ వర్గాలు యూరియా డీఏపీ ఎమ్మార్పీపై బస్తాకి రూ.50 నుంచి రూ.60 వరకు అదనంగా చెబుతున్నారని, దీంతో పాటు బయో ఎరువులు, గ్రోత్‌లు తప్పనిసరిగా కొనాలనే నిబంధనలు విధిస్తున్నారన్నారు. దీంతో ఈ ఏడాది ఎరువులు అమ్మకూడదని సమావేశంలో తీర్మానించినట్లు పేర్కొన్నారు. ఎరువుల డీలర్ల ఇబ్బందులు, రైతుల శ్రేయస్సు దృష్ట్యా మార్క్‌ఫెడ్ ద్వారా ఎరువులు ఎమ్మార్పీ లోపు ఇప్పించాలని కోరారు. కార్యక్రమంలో సంఘం నేతలు ఉప్పల శ్రీరామ్‌భూపాల్, బండ్రెడ్డి సురేష్, చిట్టా సాగర్, జల్లూరి మురళి, ఎం.నరేంద్ర, సీహెచ్ రమణ తదితరులు పాల్గొన్నారు.

జగనన్న కాలనీ సమస్యలు ఎప్పుడు పరిష్కరిస్తారు?

బంటుమిల్లి: స్థానిక జగనన్న కాలనీలో మౌలిక సౌకర్యాల సమస్యను ఎప్పుడు పరిష్కరిస్తారని ఎంపీటీసీ సభ్యుడు కమాల్‌బాషా అధికారులను నిలదీశారు. మండల పరిషత్ సర్వసభ్య సమావేశం మంగళవారం ఎంపీడీఓ నీరజాక్షి పర్యవేక్షణలో ఎంపీపీ వి.చినబాబు అధ్యక్షతన మండల పరిషత్ కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా హౌసింగ్ శాఖ ఏఈఈ మణికంఠ తన నివేదిక సమర్పించారు. ఈ సందర్భంగా బంటుమిల్లి–1 ఎంపీటీసీ కమాల్‌బాషా మాట్లాడుతూ బయట అద్దెలు భరించలేక కొందరు ఏదోవిధంగా ఇళ్లు నిర్మించుకుని ఉంటున్నారని, వారంతా ఇబ్బందులు పడుతున్నారన్నారు. కాలనీలో నేటికీ తాగునీరు, వీధిలైట్లు, రోడ్డు సౌకర్యాలు లేవన్నారు. మురుగునీటిలో లబ్ధిదారులు ఎలా నివశిస్తారంటూ ఘుండిపడ్డారు. ఏఈఈ మణికంఠ మాట్లాడుతూ జగనన్న కాలనీలో మౌలిక సౌకర్యాల కోసం అంచనాలు వేసి ప్రభుత్వానికి పంపామని, మంజూరు కాగానే పనులు పూర్తి చేస్తామన్నారు. సమావేశంలో వివిధ శాఖల అధికారులు తమ నివేదికలు సమర్పించారు. అయితే రైతులకు సంబంధించి ముఖ్యమైన శాఖలైన వ్యవసాయం, ఇరిగేషన్, డ్రైనేజి, పశుసంవర్ధకశాఖ, ప్రాథమిక వైద్య శాఖ అధికారులు సర్వసభ్య సమావేశానికి గైర్హాజరు కావడంపై ఎంపీటీసీలు, సర్పంచ్‌లు ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిపై ఎంపీడీఓ నీరజాక్షి స్పందిస్తూ సమావేశానికి గైర్హాజరైన అధికారులకు శాఖలవారీ నోటీసులు ఇస్తామన్నారు. సమావేశంలో వైస్ ఎంపీపీ కె.లలిత, పలువురు ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, అధికారులు పాల్గొన్నారు.

ఖరీఫ్ సాగుకు వరి విత్తనాలు సిద్ధం



వెంకటాపురంలో రైతులకు వరివిత్తనాలు అందిస్తున్న ఎంపీపీ దుర్గావాణి

వెంకటాపురం(మోపిదేవి): ఖరీఫ్ సాగుకు గ్రామ సచివాలయాల వద్ద వరివిత్తనాలు సిద్ధంగా ఉన్నట్లు ఎంపీపీ రావి దుర్గావాణి తెలిపారు. మండల పరిధిలోని వెంకటాపురం, మెరకనపల్లి గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏవో హెప్సిబారాణి మాట్లాడుతూ రైతు సేవా కేంద్రాల వద్ద వరి విత్తనాలు అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. ఎంటీయూ 1061 వరి రకం ధాన్యం ప్రభుత్వం కొనుగోలు చేయదని కొంతమంది రైతులు అపోహపడుతున్నట్లు తన దృష్టికి వచ్చిందని, అలాంటిది ఏమీ లేదని తెలిపారు. వరి విత్తనాలు నారుమడి పోసే సమయంలో ముందు మొలక శాతం చూసుకుని నారుమడి పోయాలని సూచించారు. సూడోమోనాస్‌తో విత్తన శుద్ధి చేయడం వల్ల ప్రారంభదశలో అగ్గి తెగులు రాకుండా నివారించవచ్చునని చెప్పారు. ప్రభుత్వ సబ్సిడీ కింద డ్రోన్లు కూడా ఇస్తున్నారని, మరింత మంది రైతులకు ఈ సంవత్సరం వ్యవసాయ యంత్రపరికరాలు సబ్సిడీ కింద ప్రభుత్వం అందిస్తుందని తెలిపారు. గ్రామ వ్యవసాయ సహాయకురాలు నీహారిక, రైతులు పాల్గొన్నారు.

నేడు 300 మందితో కృష్ణానదిలో జలయోగా

ఏర్పాట్లు పరిశీలించిన అవనిగడ్డ ఎమ్మెల్యే, తహసీల్దార్



ఘాట్ వద్ద కృష్ణానదిలో జలయోగ ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే, తహసీల్దార్, అధికారులు

నాగాయలంక: అంతర్జాతీయ యోగా దినోత్సవం మాసోత్సవాలను పురస్కరించుకుని నిర్వహిస్తున్న యోగాంధ్ర కార్యక్రమాల్లో భాగంగా స్థానిక శ్రీపాద క్షేత్రం వద్ద కృష్ణానదిలో బుధవారం మధ్యాహ్నం ఈతలో నిష్ణాతులైన 300 మందితో కృష్ణానదిలో జలయోగా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, తహసీల్దార్ ఎం.హరనాథ్ తెలిపారు. ఏర్పాట్లలో భాగంగా వారు మంగళవారం ఆ ప్రాంతాన్ని పరిశీలించారు. నదిలో జరిపే యోగా కార్యక్రమంలో పద్మాసనం, శవాసనం తదితర అనువైన ఆసనాలు ఉంటాయని చెప్పారు. కృష్ణానది తీరంలోని ఫుడ్‌కోర్టు భవనంలో జలయోగ నిర్వహణ అంశాలపై మత్స్యశాఖ అధికారులు ఆర్.ప్రతిభ, సునీత, ఆయుష్ విభాగం వైద్యాధికారులు, రెవెన్యూ ఉద్యోగులతో ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ చర్చించారు.

ఈ నెలాఖరు వరకు విద్యుత్ కోతలు తప్పవు

చల్లపల్లి: నున్న–గుడివాడ ప్రాంతాల మధ్య ఉన్న 220 కేవీ విద్యుత్ లైన్ల ట్రాన్స్‌మిషన్ ఆధునికీకరణ పనులు జరుగుతున్నందున జూన్ నెలాఖరు వరకూ విద్యుత్ సరఫరాలో అడపాదడపా అంతరాయం కలిగే అవకాశం ఉందని ఉయ్యూరు విద్యుత్ శాఖ డీఈఈ డి.కృష్ణనాయక్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం నుంచి ఈ నెల 30వ తేదీ వరకూ ఉదయం 7 నుంచి సాయంత్రం 6 గంటల మధ్య ఆధునికీకరణ పనులు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ కారణంగా గుడివాడలోని 220 కేవీ విద్యుత్ ఉపకేంద్రంలో ఒక సర్క్యూట్‌లో తాత్కాలికంగా విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని వివరించారు. సరఫరాలో అంతరాయం రాకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేశామని, అత్యవసరం అయితేనే విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తామని తెలిపారు. గుడివాడ, పామర్రు, అవనిగడ్డ, మచిలీపట్నం, చిగురుకోట ఉపకేంద్రాల పరిధిలోని విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కృష్ణనాయక్ కోరారు.

సంక్షిప్త వార్తలు

• సోలార్ వినియోగం మరింత పెరగాలి :ఎమ్మెల్యే బుద్ధప్రసాద్

అవనిగడ్డ: సోలార్ వినియోగం వల్ల ఎన్నో ప్రయోజనాలున్నాయని, వీటి వినియోగం మరింత పెరగాలని శాసనసభ్యుడు మండలి బుద్ధప్రసాద్ అన్నారు. సబ్ డివిజన్ పరిధిలో వంద ఇళ్లకు సోలార్ విద్యుత్ లక్ష్యం సాధించిన సందర్భంగా స్థానిక శాసనసభ్యుని కార్యాలయంలో మంగళవారం ఎమ్మెల్యే బుద్ధప్రసాద్‌తో కేక్ కట్ చేయించారు. ఈ సందర్భంగా పీఎం సూర్యఘర్ కరపత్రాలను ఎమ్మెల్యే బుద్ధప్రసాద్, విద్యుత్ శాఖాధికారులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో విద్యుత్‌శాఖ డీఈ ఎన్.సుబ్రహ్మణ్యేశ్వరరావు, ఏఈ ఎస్‌వీ సత్యనారాయణ పాల్గొన్నారు.

• ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

చల్లపల్లి: ప్రభుత్వం రైతులకు కల్పించే సౌకర్యాలను, పథకాలను సద్వినియోగం చేసుకుని అధిక దిగుబడులు సాధించాలని కొడాలి మార్కెట్ యార్డు చైర్‌పర్సన్ తోట కనకదుర్గ అన్నారు. మండల పరిధిలోని చల్లపల్లి, వక్కలగడ్డ రైతు సేవా కేంద్రాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన కనకదుర్గ మాట్లాడుతూ వ్యవసాయ శాఖ శాస్త్రవేత్తలు, అధికారుల సూచనలు, సలహాలను పాటిస్తూ నాణ్యమైన పంట దిగుబడులను సాధించేందుకు కృషిచేయాలని కోరారు. మండల వ్యవసాయ అధికారి కె.మురళీకృష్ణ మాట్లాడుతూ ప్రస్తుతం రైతులకు కల్పిస్తున్న వివిధ రాయితీలను వివరించారు. కార్యక్రమంలో శాస్త్రవేత్త డాక్టర్ లహరి, పశుసంవర్ధక శాఖ ఏడీఏ డాక్టర్ వెంకటరెడ్డి ప్రసంగించారు. ఏఎంసీ సూపర్‌వైజర్ బి.తులసీదాస్, పీఏసీఎస్ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

• కిసాన్ మోర్చా గ్రామ కమిటీల ఏర్పాటు

బొబ్బర్లంక(మోపిదేవి): భారతీయ జనతా పార్టీ కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో ప్రతి గ్రామంలో గ్రామ కమిటీలు ఏర్పాటు చేస్తున్నట్లు రాష్ట్ర కౌలు రైతుల కన్వీనర్ జీవీ నగరాయులు తెలిపారు. మండలంలోని కొక్కిలిగడ్డ, బొబ్బర్లంక తదితర గ్రామాల్లో మంగళవారం పర్యటించిన నగరాయులు పలువురు రైతులను కలసి కిసాన్ మోర్చా గ్రామ కమిటీల ప్రాముఖ్యతను వివరించారు. అనంతరం గ్రామ కమిటీలను ప్రకటించారు. బొబ్బర్లంక గ్రామ కమిటీ అధ్యక్షుడిగా కోనేరు శివలీల ప్రసాద్, ప్రధాన కార్యదర్శిగా మత్తి రామకృష్ణ, కొక్కిలిగడ్డ గ్రామ కమిటీ అధ్యక్షుడిగా కేసాని శివరావు, ప్రధాన కార్యదర్శిగా గుంటూరు శ్రీనివాసరావులను ఎంపికచేసినట్లు తెలిపారు. కిసాన్ మోర్చా నియోజకవర్గ కన్వీనర్ భూపతి సుబ్రహ్మణ్యం, కామిశెట్టి రమేష్, ఆలూరి శ్రీనివాస్, యార్లగడ్డ రామకృష్ణ పాల్గొన్నారు.

• మహాభారతంలో మహిళా చైతన్యం

మచిలీపట్నంటౌన్: ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ యు.వరలక్ష్మి మహాభారతంలో మహిళా చైతన్యం అనే అంశంపై ప్రసంగించారు. స్థానిక మహతి లలిత కళావేదిక వద్ద మంగళవారం రాత్రి డాక్టర్ బృందావనం ధన్వంతరి ఆచార్య ఆధ్వర్యంలో ఈ సత్సంగం నిర్వహించారు. ప్రముఖ రచయిత డాక్టర్ బొమ్మరాజు సారంగపాణి అధ్యక్షత వహించారు. మహాభారతంలోని స్త్రీ పాత్రలయిన గాంధారి, కుంతి, ద్రౌపదిల ఔచిత్యాన్ని, ఆ పాత్రలలోని చైతన్యాన్ని అనేక ఉదాహరణలతో వరలక్ష్మి వివరించారు. పలు పద్యాలు, ఉపాఖ్యానాలు, సంభాషణలు, సూక్తులతో వరలక్ష్మి ఉపన్యాసం ఉత్తేజభరితంగా సాగింది. తొలుత వరలక్ష్మిని భట్టిప్రోలు లక్ష్మీ సుగుణ సభకు పరిచయం చేశారు. కార్యక్రమంలో ఏపీఎస్‌ఆర్టీసీ డిపో మేనేజర్ టి.పెద్దిరాజు, డాక్టర్ చింతలపాటి మురళీకృష్ణ, దండిభొట్ల దత్తాత్రేయ శర్మ, సవరం వెంకటేశ్వరరావు, కారుమూరు రాజేంద్రప్రసాద్, మేడిశెట్టి యోగేశ్వరరావు, కాపువరపు చంద్రశేఖర్, అప్పినేడి పోతరాజు తదితరులు పాల్గొన్నారు.

• చల్లపల్లి మండల వ్యవసాయాధికారిగా మురళీకృష్ణ బాధ్యతల స్వీకారం



చల్లపల్లి: చల్లపల్లి మండల వ్యవసాయాధికారిగా కె.మురళీకృష్ణ బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ పని చేసిన సాయిసింధు బదిలీపై వెళ్లగా ఆమె స్థానంలో మురళీకృష్ణ వచ్చారు. ఈ సందర్భంగా మంగళవారం మురళీకృష్ణ మాట్లాడుతూ వ్యవసాయానికి సంబంధించి ఎటువంటి సందేహాలు వచ్చినా తనను సంప్రదించవచ్చని రైతులకు సూచించారు.

• పెడన డిప్యూటీ ఎంపీడీవోగా నాగిరెడ్డి బాధ్యతల స్వీకరణ

పెడన: పెడన డెప్యూటీ ఎంపీడీవోగా ఎం.నాగిరెడ్డి మంగళవారం బాధ్యతలను స్వీకరించారు. ఈయన ఏలూరు జిల్లా జంగారెడ్డిగూడెం మండలంలో నుంచి రిక్వెస్టు బదిలీపై పెడనకు వచ్చారు. డెప్యూటీ ఎంపీడీవో విధులతో పాటు ఈవోపీఆర్డీ విధులను పూర్తిబాధ్యతలను నిర్వహించనున్నారు.

• యూపీహెచ్‌సీకి వాటర్ ప్యూరిఫైడ్ మిషన్ అందజేత

పెడన: పెడన అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటరుకు మంగళవారం పట్టణానికి చెందిన ఝాన్సీ కలంకారీ యజమాని పిచ్చుక కోటేశ్వరరావు వాటర్ ప్యూరిఫైడ్ మిషన్‌ను అందజేశారు. కార్యక్రమంలో యర్రా టార్జనరావు, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

• ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో రైతులు లాభాలు సాధించాలి

శ్రీకాకుళం(ఘంటసాల): ఆధునిక వ్యవసాయ సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి రైతులు లాభాలు సాధించాలని మొవ్వ ఏడీఏ ఎస్.శ్యామల అన్నారు. ఘంటసాల మండలం శ్రీకాకుళం, అచ్చెంపాలెం గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీఏ శ్యామల రైతులు అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పారు. కేవీకే శాస్త్రవేత్త ఎం.వెంకటలక్ష్మి మాట్లాడుతూ వరి నారుమడుల్లో తీసుకోవాల్సిన యాజమాన్య పద్ధతులు వివరించారు. ఉద్యానశాఖ అధికారి జె.కీర్తి మాట్లాడుతూ పూలు, పండ్లు, కూరగాయల తోటల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పామాయిల్ తోటల పెంపకం ప్రాముఖ్యతను తెలియజేశారు.

• నేటి నుంచి సత్యసాయి ప్రేమ రథయాత్ర

మచిలీపట్నంటౌన్: శ్రీ సత్యసాయిబాబా శత జయంతి వేడుకల్లో భాగంగా ఈ నెల 18వ తేదీ నుంచి 21వ తేదీ వరకూ కృష్ణాజిల్లాలో జరిగే శ్రీ సత్యసాయి ప్రేమ రథయాత్రను జయప్రదం చేయాలని కృష్ణా యూనివర్సిటీ ఉప కులపతి రాంజీ కోరారు. రథయాత్ర కరపత్రాలను మంగళవారం ఆయన ఆవిష్కరించారు. ఈ నెల 18వ తేదీ బుధవారం ఉదయం 6 గంటలకు స్థానిక శ్రీ పాండురంగస్వామి ఆలయం వద్ద నుంచి విశేష పూజల అనంతరం రథయాత్ర ప్రారంభమవుతుందన్నారు. మచిలీపట్నం శ్రీ సత్యసాయి సేవా సమితి కన్వీనర్ పోతుకూచి ఆంజనేయకుమార్ మాట్లాడుతూ మచిలీపట్నంలో ప్రారంభమయ్యే ఈ రథయాత్ర పెడన, లంకపల్లి, చల్లపల్లి, మోపిదేవి, అవనిగడ్డ వరకూ జరుగుతుందన్నారు.

చల్లపల్లి: శ్రీ సత్యసాయి శత జయంతి ఉత్సవాల్లో భాగంగా ఈనెల 18వ తేదీ నుంచి 21వ తేదీ వరకు కృష్ణాజిల్లాలోని వివిధ ప్రాంతాల్లో శ్రీసత్యసాయి ప్రేమ రథయాత్ర ఉత్సవాన్ని నిర్వహించనున్నట్లు లంకపల్లి(తూర్పు)లోని శ్రీసత్యసేవా యోగ మండలి ధ్యానకేంద్రం వ్యవస్థాపకులు శ్రీనివాస్ గురూజీ మంగళవారం తెలిపారు.

• బాధితులకు నిత్యావసర వస్తువులు అందజేత

గూడూరు: పోలవరంలో జరిగిన అగ్ని ప్రమాదంలో సర్వస్వం కోల్పోయిన బాధితులకు చలమలశెట్టి చారిటబుల్ ట్రస్ట్ తరఫున ఆ ట్రస్టు ప్రతినిధులు మంగళవారం నిత్యావసర వస్తువులు, వంట సామగ్రి అందజేసింది. గ్రామంలో రెండు రోజుల క్రితం జరిగిన ప్రమాదంలో మురాల లక్ష్మీకుమారి ఇల్లు కాలిపోయి నిరాశ్రయులయ్యారు.